క్లుప్తంగా

ముగిసిన శ్రీరామకోటి మహోత్సవాలు



నందిగామ రూరల్: పట్టణంలో వేంచేసిన సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 72వ శ్రీరామకోటి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భక్తి సంకీర్తనలు, కూచిపూడి నృత్యం, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామనామ సంకీర్తన సంఘ సభ్యులు దొడ్డ నాగేశ్వరరావు, మారం వెంకటేశ్వరరావు, పులిపాటి శ్రీనివాసరావు, కొత్త ప్రభాకర్, పెద్దిరాజు, పారేపల్లి శ్రీనివాసరావు, వనమా బుల్లెబ్బాయి, కేతేపల్లి ఆంజనేయులు, అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షజాచార్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం గుంటూరుకు చెందిన కటకంశెట్టి బాలసైదులు రూ.25 వేలు విరాళం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆయన ఆలయ అధికారులకు విరాళం అందజేశారు. అనంతరం దాతను వేద పండితులు ఆశీర్వదించగా, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పోషణ్ భీ.. పడాయి భీపై అవగాహన

నందిగామ టౌన్: అంగనవాడీ కేంద్రాలను పోషకాహార కేంద్రాలుగానే కాకుండా విద్యనందించే కేంద్రాలుగా మార్చేందుకే ప్రభుత్వం పోషణ భీ పడాయి భీ కార్యక్రమాన్ని రూపొందించిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకట్రావమ్మ, కరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్, ఐసీడీఎస్ కార్యాలయాలలో అంగనవాడీ కార్యకర్తలకు పోషణ భీ.. పడాయి భీ కార్యక్రమంపై మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వెంకట్రావమ్మ, కరుణకుమారి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు విద్యాబోధన, పోషణ, మేధా అభివృద్ధి, భాషాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో నల్ల తామర పురుగులను నివారించాలి



నందిగామ రూరల్: మామిడి తోటల్లో నల్ల తామర పురుగు నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారి నీలిమ సూచించారు. మండలంలోని కంచల గ్రామంలో ఉన్న మామిడి తోటలను ఆమె మంగళవారం పరిశీలించారు. నల్ల తామర పురుగు నివారణ కోసం ఎకరాకు 40 చొప్పున నీలి, తెలుపు రంగు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని నీలిమ సూచించారు. వేప సంబంధిత మందులను నీటితో కలిపి చెట్లపై పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వీర అభయాంజనేయుడికి విశేష పూజలు



కంచికచర్ల: మండలంలోని పరిటాల శివారులో జాతీయ రహదారి పక్కన కొలువై ఉన్న వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస ఆచార్యులు తమలపాకులతో స్వామి వారికి ప్రత్యేకంగా అలంకారం చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

- కోతకు గురైన రహదారులు
- మరమ్మతులకు నోచని వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

పెనుగంచిప్రోలు: అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. పెనుగంచిప్రోలులో రోడ్లు మొత్తం గుంతలు పడినా, రహదారి మధ్యలోని కల్వర్టుల వద్ద రంధ్రాలు పడినా, రోడ్డు అంచులు కోతకు గురైనా అధికారులు పట్టించుకోవడంలేదు. మరమ్మతులకు నోచని రోడ్లతో వాహన చోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ నెల 14 నుంచి ఐదు రోజుల పాటు పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి చిన్నతిరునాళ్ల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు గ్రామానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. తిరుపతమ్మ సన్నిధికి ప్రభ బండ్లు సైతం వస్తాయి. అయినా రహదారుల మరమ్మతులను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

కోతకు గురైన భూమి

స్థానిక మునేరు అవతల అమ్మవారి మామిడి తోటకు ముందు రోడ్డు పక్కన వరదలకు పెద్ద గొయ్యి ఏర్పడింది. కొద్ది రోజుల క్రితం రోడ్డు మార్జిన్ గుంతలో ముచ్చింతాలకు చెందిన వాహనదారులు పడి తీవ్ర గాయాలపాలయ్యారు. అమ్మవారి చిన్నతిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా అనిగండ్లపాడు నుంచి ఈదారి గుండానే పసుపు – కుంకుమ బండ్లు, ప్రభ బండ్లు వస్తాయి. ఆదమరిస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. అనిగండ్లపాడు నుంచి పెనుగంచిప్రోలు వరకు ఆర్అండ్‌బీ రహదారి మొత్తం వరదలకు కోతకు గురై అధ్వానంగా మారింది. ఈ రోడ్డుకు తక్షణం మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



పెనుగంచిప్రోలు కాజ్‌వేపై పిల్లర్లు లేని ప్రదేశం



అమ్మవారి మామిడి తోట ఎదుట కోతకు గురైన రోడ్డు



గుంతల మయంగా ముండ్లపాడు - పెనుగంచిప్రోలు రోడ్డు

పిల్లర్లను సరిచేయడం మరిచారు

మునేరు కాజ్‌వేకు మరమ్మతుల సందర్భంగా పక్కన ప్రత్యామ్నాయంగా తాత్కాలిక రోడ్డును నిర్మించారు. దీని కోసం కాజ్‌వే పిల్లర్లు కొన్ని తొలగించారు. కాజ్‌వే నిర్మాణం పూర్తయిన తరువాత తాత్కాలిక రోడ్డును తొలగించినా ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం పిల్లర్లు ఏర్పాటు చేయక పోవటంతో అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి.

గతుకుల మయంగా రహదారి

తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి మండలంలోని జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్ రోడ్స్ వరకు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ నుంచి పెనుగంచిప్రోలు వరకు తొమ్మిది కిలో మీటర్ల మేర రహదారి మొత్తం గుంతల మయంగా మారింది. ఈ రహదారిపై రావాలంటే వాహనదారులు హడలి పోతున్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈరహదారికి తాత్కాలికంగా అయినా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారులు దారుణం



మండలంలోని పలు రహదారులు దారుణంగా ఉన్నాయి. ముఖ్యంగా పెనుగంచిప్రోలు – అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు – ముండ్లపాడు రోడ్డు మొత్తం గుంతలు పడి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. అమ్మ వారి జాతర సమయానికి గుంతలను అన్నా పూడుస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు.

– కొత్తపల్లి పెంటయ్య, అనిగండ్లపాడు

వాహనదారుల పాట్లు



రహదారులు మరమ్మతులకు నోచుకోక పోవటంతో వాహనదారులు అనేక పాట్లు పడుతున్నారు. మునేరు అవతల అమ్మవారి మామిడి తోట వద్ద వరదకు రోడ్డు పక్కన కోతకు గురైన చోట మట్టిపోయక పోవటంతో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై నుంచి గుంతలో పడి గాయాల పాలయ్యారు. తక్షణం అధికారులు స్పందించాలి.

–నెల్లూరి గోపి, ముచ్చింతాల

ప్రతిపాదనలు పంపించాం

కోతకు గురైన రోడ్లు, గుంతలు పడిన రోడ్లను ఇప్పటికే పరిశీలించాం. ఈ రోడ్ల మరమ్మతులకు సంబంధించి రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే తక్షణం మరమ్మతులు చేయిస్తాం.

– కిషోర్, ఆర్అండ్‌బీ జేఈ

లింగాల బ్రిడ్జికి తక్షణం మరమ్మతులు చేపట్టాలి

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు



దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

వత్సవాయి: మండలంలోని లింగాల వద్ద మునేరుపై ఉన్న బ్రిడ్జికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి దెబ్బతిన్న బ్రిడ్జిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ఏడాది సెప్టెంబర్‌లో మునేరుకు వచ్చిన భారీ వరదతో బ్రిడ్జి చప్టాతో పాటు పక్కన పిల్లర్లు, పైపులైన్లు కొట్టుకు పోయాయన్నారు. చప్టా పలు చోట్ల కొట్టుకుపోయి గుంతలు పడ్డాయని వివరించారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ బ్రిడ్జి మీదుగా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ మధ్య ఉన్న ఈ ప్రధాన రోడ్డు దెబ్బతిని ఏడు నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు.

పట్టించుకోని స్థానిక ప్రజాప్రతినిధి

120 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి శ్లాబు వరదులు వచ్చిన ప్రతిసారీ కొట్టుకుపోతుందని తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, లింగాల గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్ ఈ బ్రిడ్జి మీదనే తరచూ పర్యటిస్తారని, వారు కూడా మరమ్మతులు పట్టించుకోకపోవటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మరమ్మతులపై ఆర్అండ్‌బీ అధికారులను అడిగితే టెండర్లు పూర్తయ్యాయని చెబుతున్నారే తప్ప పనులు ప్రారంభించడంలేదని పేర్కొన్నారు. తక్షణం బ్రిడ్జి మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్తగా హైలెవల్ బ్రిడ్జికి ప్రతిపాదనలు చేయాలని కోరారు. పది రోజుల్లో మరమ్మతులు చేపట్టకపోతే వైఎస్సార్ సీపీ తరఫున రోడ్డును దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా వైకుంఠరావు, వత్సవాయి, జగ్గయ్యపేట పార్టీ మండలాల అధ్యక్షులు గుత్తా శంకరరావు, బూడిద నరసింహారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కనగాల రమేష్, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, శ్రీకనకదుర్గమ్మవారి ఆలయ మాజీ డైరెక్టర్ నంబూరి రవి, వైస్ ఎంపీపీ కె.వెంకటేశ్వర్లు, డబ్బాకుపల్లి సర్పంచ్ కె.నగేష్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, మాజీ ఎంపీపీ డి.రూప్లానాయక్, నాయకులు వడ్డే పరమయ్య, నాగేంద్రరెడ్డి, నరేష్, ఎస్సీ సెల్ నాయకుడు కన్నమాల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లలో ఇసుక కొడుతున్న ట్రాక్టర్లు



నందిగామలో పట్టా లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు

నందిగామ రూరల్: ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై పట్టాలు కప్పడంలేదు. ఆ ట్రాక్టర్ల నుంచి గాలికి ఇసుక లేచి ద్విచక్ర వాహనదారులు, పాదచారుల కళ్లలోపడుతోంది. బస్సులు, ఆటోల కోసం రోడ్డు పక్కన వేచి ఉండే ప్రయాణికుల కళ్లలోనూ ఈ ట్రాక్టర్లు ఇసుక కొడుతున్నాయి. పట్టణానికి సమీపంలో ఉన్న మున్నేరు, రాఘవాపురం డొంక, తదితర వాగుల నుంచి పట్టణంలోని బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలకు కొందరు ట్రాక్టర్లతో ఇసుక రవాణాచేస్తున్నారు. ఇసుక లోడుపై పట్టాలు కప్పకుండా ట్రాక్టర్లు అతివేగంగా ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా కళ్లలో ఇసుక పడుతోందని, పలు మార్లు ప్రమాదాలబారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు పేర్కొంటున్నారు. పట్టాలు కప్పకుండా ఇసుక రవాణా ట్రాక్టర్లను సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పట్టాలు లేకుండా ఇసుక రవాణా చేసే వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. చలో విజయవాడ – యువత పోరు కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉదయం ఎనిమిది గంటలకు జగ్గయ్యపేట పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వత్సవాయి మండలానికి సంబంధించి వత్సవాయి గ్రామంలోని గాంధీ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. పెనుగంచిప్రోలు మండల పరిధిలో పెనుగంచిప్రోలు లోని డౌన్ సెంటర్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని తెలిపారు.

యువత పోరుకు తరలిరావాలి

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యువత పోరు కార్యక్రమంలో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు బుధవారం ఉదయం పది గంటలకు విజయవాడ తరలిరావాలని తన్నీరు నాగేశ్వరరావు కోరారు. వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

తిరునాళ్ల సందడి



ఆలయం వద్ద వివిధ డిపార్ట్‌మెంట్లు కోసం టెంట్లు ఏర్పాటు



చిల్లకల్లు వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



జెయింట్ వీల్, ఎగ్జిబిషన్ ఏర్పాట్లు

పెనుగంచిప్రోలులో వేంచేసిన శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల సందడి మొదలైంది. ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయం వద్ద చిన్నా పెద్దా అందరికీ వినోదాన్ని పంచే ఎగ్జిబిషన్‌లో జెయింట్‌వీల్, బ్రేక్ డాన్స్, మ్యాజిక్ షోలు, రకరకాల దుకాణాలు సిద్ధం చేస్తున్నారు. మునేరులో భక్తులు స్నానాలు చేసేందుకు షవర్‌బాత్‌లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. మునేరులో భక్తులు సేద తీరేందుకు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వద్ద తాత్కాలిక సమాచార కేంద్రంతో పాటు వివిధ డిపార్ట్‌మెంట్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పలు కూడళ్ల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు.

–పెనుగంచిప్రోలు

మహిళగా పుట్టడం గొప్ప వరం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న సిస్టర్లు, మహిళలు

జగ్గయ్యపేట అర్బన్: సృష్టికి ప్రతి సృష్టి చేసి సమాజానికి మార్గనిర్దేశనం చేసే మహిళగా పుట్టడం గొప్ప వరమని వాగ్దేవి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ బుస్సా సరిత అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ హాస్పిటల్ అనుబంధ విభాగమయిన జగ్గయ్యపేట కీర్తి పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ ఇన్‌చార్జ్ సిస్టర్స్ లైజీ జోష్, సిస్టర్ సునీత ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బుస్సా సరిత, సెయింట్ ఆన్స్ సుపీరియర్ సిస్టర్ మేరీ ఆంటో పాల్గొని సందేశం ఇచ్చారు. ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం, సమాజం ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ వేడుకల్లో పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థినులు ఆరోగ్యంగా ఉన్నపుడే చదువుపై మనస్సు లగ్నం చేయగలుగుతారని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో స్వచ్ఛంద సంస్థ కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.లక్ష విలువైన పునర్వినియోగ శానిటరీ నాప్‌కిన్లను 300 మంది కిశోర బాలికలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని కిశోర దశలో బాలికలు తీసుకోవాల్సిన పలు ఆరోగ్య పరమైన జాగ్రత్తలను వివరించారు. సహకార భారతి జాతీయ కార్యవర్గ సభ్యురాలు జానకీదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు అందిస్తున్న సేవలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార భారతి రాష్ట్ర మహిళా ప్రముఖ్ నళిని, సామాజికవేత్త కర్లపాటి శ్రీనివాసరావు, స్కూల్ హెచ్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, రాయపూడి వెంకటేశ్వరరావు, కర్లపాటి ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని కార్యదర్శుల వినతి



కంచికచర్ల ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కంచికచర్ల: తమపై ప్రభుత్వం అదనపు పనిభారం మోపుతుందని, తీవ్ర మానసిక ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్నామని పలువురు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. తమపై పనిభారం తగ్గించాలని మండల పరిషత్ కార్యాలయంలో ఎండీడీఓ బి.ఎం.విజయలక్ష్మికి మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు కార్యదర్శుల సంఘ నాయకులు ఇందుపల్లి నానిబాబు, ఎస్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు ఇంటి పన్నులు, నీటి కుళాయి పన్నులు వసూలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు నిత్యం డ్రెయిన్లలో మురుగునీటి పారుదల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రస్తుతం తమ విధులతోపాటు మిస్సింగ్ సిటిజెన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, హౌస్‌హోల్డ్ సర్వే, జియో ట్యాగింగ్ సర్వే తదితర సర్వేలు చేయిస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులు పలు రకాల వీడియో కాన్ఫరెన్స్‌లతో అదనపు పనిభారం పెడుతున్నారని, దీనివల్ల తమ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తంచేశారు. తమపై మోపిన అదనపు పనిభారాన్ని తగ్గించాలని ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బండి రాజ్యలక్ష్మి, ఏలూరి కరుణ, ఎస్.సంగమయ్య, ఫణీంద్ర, అబ్దుల్ జలీల్, జిల్లేపల్లి రత్నాకర్, ఆర్.పి.రాంజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు

వీరులపాడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని జుజ్జూరు గ్రామానికి చెందిన తల్లపు రూపేష్, తమ్మిశెట్టి గోపీ మంగళవారం ద్విచక్ర వాహనంపై అల్లూరు గ్రామం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. జుజ్జూరు గ్రామ సమీపంలోకి వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో వారిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎలుకల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



విషపు ఎర తయారీపై అవగాహన కలిగిస్తున్న ఏఓ

కంచికచర్ల: మండలంలోని వేములపల్లిలో మంగళవారం మండలస్థాయి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ మాట్లాడుతూ.. వరి చేలల్లో ఎలుకలు చేరి పంటను నాశనం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎలుకల నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలుకల నియంత్రణకు విషపు ఎరను తయారు చేసి పొలంలో ఉంచాలని పేర్కొన్నారు. ఆ ఎరను తిని ఎలుకలు పూర్తిగా చచ్చిపోతాయన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు వీరబాబు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో మేలు

బండిపాలెం(జగ్గయ్యపేట): వరి సాగు చేస్తున్న రైతులు సామూహిక ఎలుకల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. పొలం పిలుస్తుందిలో భాగంగా మంగళవారం రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఎలుకల నిర్మూలనకు నూరు శాతం రాయితీతో బ్రమోడాయిలిన్ మందును సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సిరిని కలిసిన ఎమ్మెల్యే



డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సిరితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఎ.సిరిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మంగళవారం తాడేపల్లిలోని ఆమె కార్యాలయంలో కలిశారు. జగ్గయ్యపేట పట్టణంలోని సీహెచ్‌సీని 50 పడకల నుంచి వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కోసం ప్రభుత్వం నుంచి సూచనలు రావడం, దానికి స్థల సేకరణ గురించి, శానిటరీ, సెక్యూరిటీ సిబ్బంది పెంపు గురించి, ఇతర అంశాల గురించి ఆమెకు వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలల చట్టాలపై మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో బాల్య వివాహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగమణి, వైద్యాధికారి వాసంతి, సూపర్‌వైజర్లు రజనీ జ్వాల, శారద, పలువురు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com